ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

శనివారం 14 సెప్టెంబరు 2024

శరవేగంగా తంజై - విక్రవాండి ఫోర్‌లేన్

● పనులు పరిశీలించిన కేంద్ర మంత్రి గడ్కరీ

అడయార్, సెప్టెంబరు 13: తంజావూరు - విక్రవాండి ప్రాంతాల మధ్య నాలుగు లేన్ల రహదారి నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులను కేంద్ర రోడ్డు రవాణా శాఖామంత్రి నితిన్ గడ్కరీ పరిశీలించారు. శుక్రవారం నాగ్‌పూర్ నుంచి తిరుచ్చికి విమానంలో వచ్చిన కేంద్ర మంత్రి అక్కడ నుంచి రోడ్డు మార్గంలో తంజావూరు వెళ్ళి, ఈ రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ముందుగా తంజై జిల్లా కుంభకోణంలోని ఆర్ట్స్ కాలేజీకి వచ్చిన కేంద్ర మంత్రి గడ్కరీకి జిల్లా కలెక్టర్ ప్రియాంక పంకజం స్వాగతం పలికారు. ఆ తర్వాత ఎంపీలు కళ్యాణ సుందరం, సుధ, బీజేపీ సీనియర్ నేత సీపీ రాధాకృష్ణన్, కరుప్పు మురుగానందం తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. ఆ తర్వాత కుంభకోణంలోని జగద్రక్ష పెరుమాళ్ ఆలయంలో పూజలు చేసి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం విక్రవాండి నాలుగు లేన్ల దహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ నిర్మాణ పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత చోళపురం నుంచి సేద్యతోపు వరకు నాలుగు లేన్ల రహదారి ప్రాజెక్టు ప్రస్తుతం పరిస్థితిని హెలికాప్టరులో పరిశీలించారు. కాగా, కేంద్ర మంతి గడ్కరీ పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ

విదేశీ పర్యటన విజయవంతం

ముగిసిన సీఎం అమెరికా టూర్

18 కంపెనీలతో ఒప్పందాలు ● రూ.7616 కోట్లకు పెరిగిన పెట్టుబడులు ● నేడు చెన్నైకి రాక

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలోగా రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక ప్రగతి సాధించే దిశగా విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం ఆగస్టు 27న ప్రారంభమైన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అమెరికా పర్యటన విజయవంతంగా ముగిసింది. చికాగో నుంచి బయల్దేరిన ఆయన శనివారం నగరానికి చేరుకోనున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో జరిగిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొన్నారు.. భారతదేశంలో కొత్త పరిశ్రమలకు అనువైన రాష్ట్రం తమిళనాడని, రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేవారికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు గురించి సమగ్రంగా ఆయన వివరించారు. ఆ సందర్భంగా కొన్ని కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అక్కడి నుంచి చికాగో నగరానికి చేరుకున్న స్టాలిన్ దంపతులకు ప్రవాస తమిళ సంఘాల ప్రతినిధులు, తమిళులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. చికాగో నగరంలోను పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు.



చికాగో నుంచి బయల్దేరుతున్న స్టాలిన్, సీఎం దంపతులతో సెల్ఫీలు తీసుకుంటున్న ప్రవాస తమిళులు

హోసూరులో ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీ..

గురువారం రాత్రి కూడా మరి కొన్ని కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఫలితంగా అమెరికాకు చెందిన రాపిడ్ గ్లోబల్ బిజినెస్ సొల్యూషన్స్ ఇన్‌కార్పొరేషన్ (ఆర్జీబీఎస్సై) కృష్ణగిరి జిల్లా హోసూరులో రూ.100 కోట్లతో ఎలక్ట్రానిక్స్ టెలిమాటిక్స్ ఫ్యాక్టరీ నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. ఆ మేరకు చికాగో నగరంలో గురువారం రాత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో ఆ సంస్థ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ కంపెనీ చైర్మన్ డాక్టర్ నానువా సింగ్, సీఈవో రవికుమార్, రాష్ట్ర ప్రభుత్వం తరపున పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, పారిశ్రామిక మార్గదర్శక కమిటీ మేనేజింగ్ డైరెక్టర్ వీ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు..

అమెరికా పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చికాగో విమానాశ్రయం నుంచి ఇండియా బయలుదేరుతున్నప్పుడు అక్కడి తమిళ సంఘాల ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రవేశ ద్వారం వద్ద కట్టి అక్కడి తమిళ యువకులంతా స్టాలిన్ దంపతులతో సెల్ఫీలు తీసుకున్నారు. అందరి వద్దా సెలవు తీసుకుని స్టాలిన్ దంపతులు, మంత్రి టీఆర్బీ రాజా, అధికారులు విమానంలో అక్కడి నుండి బయలుదేరారు. శనివారం ఆయన నగరానికి చేరుకోనున్నారు.

స్టాలిన్ రాగానే పార్టీలో భారీ మార్పులు : దురైమురుగన్

ముఖ్యమంత్రి స్టాలిన్ అమెరికా పర్యటన ముగించుకుని తిరిగి రాగానే పార్టీలో భారీ మార్పులుంటాయని డీఎంకే ప్రధాన కార్యదర్శి, సీనియర్ మంత్రి దురైమురుగన్ తెలిపారు. వేలూరు జిల్లా కాట్పాడి వద్ద జరిగిన పార్టీ నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగనున్న ముప్పెరుంవిళా సందర్భంగా ఈ నెల 15 నుంచి 17 వరకు అందరూ నలుపు ఎరుపు రంగుల దుస్తులు ధరించాలన్నారు. ఇళ్ల వద్ద పార్టీ జెండాలు ఎగురవేయాలని విజ్ఞప్తి చేశారు.



ప్రత్యేక కోర్టుకు హాజరయ్యేందుకు వెళుతున్న స్పీకర్ అప్పావు

పరువు నష్టం దావా...

కోర్టుకు హాజరైన స్పీకర్

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఎమ్మెల్యేల పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ దాఖలైన కేసు విచారణకు స్పీకర్ అప్పావు హాజరయ్యారు. కొద్ది నెలల క్రితం నగరంలో జరిగిన పుస్తకావిష్కరణ సభలో స్పీకర్ అప్పావు ప్రసంగిస్తూ మాజీ ముఖ్యమంత్రి జయలలిత మృతిచెందినప్పుడు అన్నాడీఎంకేకు చెందిన 40 మంది ఎమ్మెల్యేలు డీఎంకేలో చేరేందుకు సిద్ధమయ్యారని, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ వారిని పార్టీలో చేర్చుకునేందుకు నిరాకరించారని చెప్పారు. ఈ వ్యాఖ్యలు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను కించపరిచే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ అన్నాడీఎంకే న్యాయవాద విభాగం డిప్యూటీ కార్యదర్శి బాబు మురుగవేల్ పరువునష్టం దావా వేశారు. ఈ కేసు విచారణ చెన్నై కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఎంపీలు, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా దాఖలైన కేసుల విచారణ జరిపే ప్రత్యేక కోర్టులో జరిగింది. కొద్ది రోజుల క్రితం సమన్ జారీ అయినా స్పీకర్ అప్పావు కోర్టు విచారణకు రాలేదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం న్యాయమూర్తి జయవేల్ ఎదుట ఈ కేసు విచారణకు వచ్చింది. స్పీకర్ అప్పావు విచారణకు హాజరయ్యారు. ఇంతకు ముందు వాయిదా సందర్భంగా తాను సమన్ జారీ చేసినా విచారణకు హాజరు కాలేదని ఆరోపించటంలో వాస్తవం లేదని తెలిపారు. కోర్టు నుంచి తనకెలాంటి సమన్లు రాలేదని స్పష్టం చేశారు. న్యాయస్థానాలపై తనకు గౌరవ మర్యాదలున్నాయన్నారు. ఆ తర్వాత న్యాయమూర్తి జయవేల్ కేసు తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేశారు.

జీఎస్టీ వల్ల ప్రజలకు కష్టాలే

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై



ఉత్తర చెన్నై జిల్లా పార్టీ నిర్వాహకుల సమావేశంలో ఎంపీ విజయ్‌వసంత్, సెల్వపెరుందగై తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 13: కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ వల్ల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై వ్యాఖ్యానించారు. ఉత్తర చెన్నై జిల్లా కాంగ్రెస్ నిర్వాహకుల సమావేశంలో శుక్రవారం పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ప్రజాదరణ పొందకుండా, ఎన్నికల్లో గెలవకుండా రాజ్యసభ సభ్యురాలిగా ఎంపికై కేంద్ర ఆర్థిక మంత్రి పదవిలో కూర్చున్న నిర్మలా సీతారామన్‌కు ప్రజల కష్టాలు తెలియదన్నారు. గురువారం కోవైలో జరిగిన జీఎస్టీ సమావేశంలో పాల్గొన్న అన్నపూర్ణ హోటల్ యజమాని శ్రీనివాసన్‌ను బెదిరించిన వ్యవహారంలో నిర్మలా సీతారామన్ రాష్ట్ర ప్రజానీకానికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు కోయంబత్తూరు గాంధీ పార్కు సమీపంలో టీఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్మలా సీతారామన్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో ఎంపీ విజయ్‌వసంత్, కౌన్సిలర్ ద్రవ్యం పాల్గొన్నారు.

రూ.21కోట్లతో అమ్మ క్యాంటీన్ల మరమ్మతులకు సన్నాహాలు

● పునరుద్ధరణకు టెండర్ల ఆహ్వానం



పెరంబూర్, సెప్టెంబరు 13: అమ్మ క్యాంటీన్ల పునరుద్ధరణకు టెండర్లు ఆహ్వానించారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో 200 వార్డులు, 7 ప్రభుత్వాఆస్పత్రులు కలిపి మొత్తం 388 అమ్మ క్యాంటీన్లు పనిచేస్తున్నాయి. వీటిలో పలు క్యాంటీన్ భవనాలు శిథిలావస్థకు చేరాయని, క్యాంటీన్లు తగిన పర్యవేక్షణ లేక అపరిశుభ్రంగా ఉన్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందాయి. దీనిపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి స్టాలిన్, అమ్మ క్యాంటీన్లు పునరుద్ధరణకు రూ.21 కోట్ల కేటాయించారు. ఈ క్రమంలో, అమ్మ క్యాంటీన్ల పునరుద్ధరణకు సంస్థను ఎంపిక చేసేలా జీసీసీ టెండర్లు విడుదల చేసింది.

మళ్లీ అన్నాడీఎంకేలో చేరిన మైత్రేయన్

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ డాక్టర్ మైత్రేయన్ మళ్లీ అన్నాడీఎంకేలో చేరారు. క్యాన్సర్ వైద్యనిపుణుడైన మైత్రేయన్ ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1991లో బీజేపీ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడిగా చేరారు. 1995 నుంచి 1997 వరకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 1997 నుంచి 199 వరకు ఆ శాఖ ఉపాధ్యక్షుడిగా, 1999 నుంచి 2000 వరకు అధ్యక్షుడిగా పని చేశారు. 2000 తర్వాత బీజేపీ నుంచి వైదొలగి అన్నాడీఎంకేలో చేరారు. 2001లో మైలాపూరు నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరపున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2002 నుంచి మూడుసార్లు రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయ్యారు. జయలలిత హయాంలో పార్టీలో ఆయన చక్రం తిప్పారు. జయ మృతి తర్వాత ఓపీఎస్ వర్గంలో, ఆ తర్వాత ఈపీఎస్ వర్గంలో కొనసాగారు. 23 యేళ్లపాటు అన్నాడీఎంకేకు సేవలందించిన మైత్రేయన్ గతేడాది సెప్టెంబర్‌లో బీజేపీలో చేరారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిని కలిసి అన్నాడీఎంకేలో చేరారు. ఈ విషయాన్ని అన్నాడీఎంకే అధిష్ఠానం శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.



ఎడప్పాడి నుంచి పార్టీ సభ్యత్వం స్వీకరిస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ మైత్రేయన్



కరెంట్ లేక రోడ్డెక్కిన జనం

థర్మల్ కేంద్రంలో అగ్నిప్రమాదం

గ్రేటర్ చెన్నైలో అంధకారం

● ఆరు గంటల ఉక్కపోతతో తల్లడిల్లిన జనం

ప్యారీస్, సెప్టెంబరు 13: గ్రేటర్ చెన్నైలో గురువారం రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నగరవాసులు ఉక్కపోతతో తల్లడిల్లిపోయారు. అసలే ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో కరెంటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక ఆస్పత్రుల్లో రోగులు చీకట్లోనే గడపాల్సిన పరిస్థితి నెలకొంది. నార్త్ చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి మనలి సబ్ విద్యుత్ స్టేషన్‌కు 400 కే.వి విద్యుత్ సరఫరా అవుతోంది. దీనికి సంబంధించిన హై టెన్షన్ విద్యుత్ తీగ తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు మనలిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో గురువారం రాత్రి 10 గంటలకు అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు ఎగిసిపడడంతో ఆ ప్రాంగణంలో ఉన్న మరో మూడు ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా మంటలు వ్యాపించాయి. ఈ కారణం వల్ల ఉత్తర, సెంట్రల్ చెన్నై ప్రాంతాలు విద్యుత్ సరఫరా లేక అంధకారంలో మునిగితేలాయి. నార్త్ చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రం, బేసిన్ బ్రిడ్జి, తండయార్‌పేట ప్రాంతాల్లోని సబ్ విద్యుత్ స్టేషన్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఎగ్మూర్, పెరియమేడు, మందవెల్లి, నుంగంబాక్కం, రాజాఅన్నామలై పురం, వడపళని, అడయార్, బీసెంట్‌నగర్, పురుషవాక్కం, పెరంబూర్, మాధవరం, కొడుంగైయూర్, అన్నానగర్, కొళత్తూర్, వ్యాసర్పాడి, వాషర్‌మెన్‌పేట, తండయార్‌పేట, తిరువొత్తియూర్, కొరుక్కుపేట, కేకే నగర్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల ప్రజలు అల్లాడిపోయారు. ఇదిలా ఉండగా, మనలిలో పరిస్థితి చక్కబడకపోవడంతో సౌత్ చెన్నై విద్యుత్ మార్గం ద్వారా ఉత్తర, సెంట్రల్ చెన్నై ప్రాంతాలకు తమిళనాడు విద్యుత్ బోర్డు అధికారులు విద్యుత్ సరఫరా కల్పించారు. తెల్లవారుజామున 4 గంటల అనంతరం కరెంట్ కష్టాలు పూర్తిగా తొలిగాయి. ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, మరోవైపు దోమల బెడదతో నగరవాసులు ఎదుర్కొన్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. విద్యుత్ సరఫరా అంతరాయంపై ఆ శాఖ మంత్రి తంగం తెన్నరసు మాట్లాడుతూ... నగరంలో ప్రధానమైన విద్యుత్ కేంద్రం అయిన మనలి సబ్ విద్యుత్ స్టేషన్‌లో గురువారం రాత్రి ఊహించని విధంగా సంభవించిన అగ్నిప్రమాదం వల్ల నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. తెల్లవారుజామున 4 గంటలకు నగరమంతటా వంద శాతం విద్యుత్ సరఫరా జరిగిందని మంత్రి వివరించారు.

ఎంతమంది విజయ్‌లొచ్చినా

డీఎంకేను కదిలించలేరు

● డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్

ప్యారీస్, సెప్టెంబరు 13: రాజకీయాల్లోకి ఎంతమంది విజయ్‌లు వచ్చినా డీఎంకేను కదిలించలేరని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ అభిప్రాయపడ్డారు. చెంగల్పట్టు జిల్లా మరమలైనగర్‌లో గురువారం జరిగిన డీపీఐ నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న తిరుమావళవన్ సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో టాస్మాక్ మద్యం దుకాణాలను మూసివేస్తారన్న నమ్మకంతోనే అక్టోబరు 2న కళ్లకుర్చిలో పార్టీ తరపున మహానాడు నిర్వహించదలచినట్లు తెలిపారు. ఈ మహానాడుకు ప్రస్తుతమున్న పొత్తులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల తర్వాత రాష్ట్రంలో డీపీఐ అతిపెద్ద పార్టీ అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు మద్యం దుకాణాలు పూర్తిగా మూసివేస్తే, ఎంతమంది విజయ్‌లు వచ్చినా డీఎంకేను కదలించలేరని తిరుమావళవన్ పేర్కొన్నారు.

నేడు డీఎండీకే 20వ వార్షికోత్సవం

● 'కెప్టెన్ ఆలయం' ప్రారంభం



ప్యారీస్, సెప్టెంబరు 13: తమిళ చిత్రసీమ దిగ్గజం కెప్టెన్ విజయకాంత్ స్థాపించిన డీఎండీకే 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన పేరుతో నిర్మించిన మందిరాన్ని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత శనివారం ప్రారంభించనున్నారు. స్థానిక కోయంబేడులో ఉన్న డీఎండీకే ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో విజయకాంత్ సమాధిని ప్రతిరోజు పెద్దసంఖ్యలో సందర్శిస్తున్న పర్యాటకులు నివాళులర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో, విజయకాంత్ స్మారక స్థలాన్ని 'కెప్టన్ ఆలయం'గా ఇటీవల నామకరణం చేశారు. ఆలయాల్లో లాగే ఇక్కడ కూడా ప్రతిరోజు గంట మోగించి పూజలు నిర్వహించడంతో పాటు అన్నదానం కూడా చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆ పార్టీ 20వ వార్షికోత్సవం సందర్భంగా కెప్టెన్ స్మారక మందిరాన్ని ప్రారంభించి ఆయన విగ్రహాన్ని కూడా ప్రేమలత ఆవిష్కరించనున్నారు. వార్షికోత్సవంలో పాల్గొనే కార్యకర్తలు, ప్రజల కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించడంతో పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమం కూడా చేపట్టనున్నారు. వార్షికోత్సవ వేడుకల్లో కుటుంబ సభ్యులతో పాల్గొనాల్సిందిగా పార్టీ నిర్వాహకులు, జిల్లా కార్యదర్శులు, కార్యకర్తలకు ప్రేమలత పిలుపునిచ్చారు.

సమాచార ద్యుని

నేడు పాఠశాలలకు సెలవు

పెరంబూర్,సెప్టెంబరు13: రాష్ట్రవ్యాప్తంగా శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. టీఎన్‌పీఎస్సీ గ్రూప్-2 పరీక్షలు శనివారం జరుగనున్నాయి. ఈ పరీక్షా కేంద్రాల్లో పలు పాఠశాలల్లో ఏర్పాటుచేసిన కారణంగా, పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు గ్రూప్-2, 2ఏ ప్రిలిమినరీ పరీక్షలు

ఐసిఎఫ్,సెప్టెంబరు13:గ్రూప్-2, 2ఏ ప్రిలిమినరీ పరీక్షలు శనివారం జరుగనుండగా, 8లక్షల మంది హాజరు కానున్నారు. 2,327 పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ జూన్‌లో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ ద్వారా 7,93,966 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ప్రిమిలినరీ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో 2,763 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. నిషేధిత వస్తువులు పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లేందుకు అనుమతి లేదని పరీక్ష నియంత్రణ అధికారి జాన్ లూయిస్ తెలిపారు.

రాయితీ ధరకు పుస్తకాల విక్రయం

ఐసిఎఫ్, సెప్టెంబరు 13: తరమణిలో ఉన్న ప్రపంచ తమిళ పరిశోధన సంస్థ దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై జయంతిని పురస్కరించుకొని శుక్రవారంనుంచి ఈనెల 30వ తేదివరకు రాయితీ ధరకు పుస్తకాలు విక్రయించనుంది.పరిశోధన విద్యార్థులు, తమిళ భాషాభిమానులు ఆదివారంమినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10.30నుంచి సాయంత్రం 5.30గంటల వరకు 30 నుంచి 50 శాతం రాయితీ ధరకు పుస్తకాలు కొనుగోలు చేయవచ్చు. మనియార్డర్ పంపించి పోస్ట్ ద్వారా పుస్తకాలు పొందవచ్చు. వివరాలకు 044-22542992, 9600021709 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

త్వరలో కల్యాణ మండపాలకు గ్రీన్ సర్టిఫికెట్

ఐసిఎఫ్, సెప్టెంబరు 13: కల్యాణ మండపాలకు త్వరలో గ్రీన్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు అటవీ, పర్యావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో భవనాలకు వినియోగం, మౌలిక వసతుల ఆధారంగా ఈ సర్టిఫికెట్ అందజేయనున్నామని తెలిపారు. ముఖ్యంగా సోలార్ విద్యుదుత్పత్తి, వర్షపు నీటి సేకరణ, ప్లాస్టిక్ వస్తువులు, శీతలీకరణ సాధనాలు వినియోగించకపోవడం వంటి విధానాలను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టామన్నారు. ఆ ప్రకారం, ఇలాంటి సౌకర్యాలున్న కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లకు గ్రీన్ సర్టిఫికెట్ అందజేయనున్నామన్నారు.

మరుదమలై ఆలయానికి కార్లు నిషేధం

పెరంబూర్, సెప్టెంబరు 13: కోయంబత్తూర్ జిల్లా మరుదుమలై సుబ్రమణ్యస్వామి కొండ ఆలయానికి కారులో వెళ్లేందుకు భక్తులకు అనుమతి లేదని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ద్విచక్రవాహనాలు, మెట్ల దారి, ఆలయానికి చెందిన బస్సుల ద్వారా వెళ్లి స్వామి దర్శనం చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

నేడు మెట్రోవాటర్ బోర్డు గ్రీవెన్స్

ఐసిఎఫ్, సెప్టెంబరు 13: చెన్నై మెట్రోవాటర్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ జరుగనుంది. బోర్డు ఆధ్వర్యంలో ప్రతినెలా రెండో శనివారం ప్రజా సమస్యల పరిష్కార శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆ ప్రకారం, ఈ నెల శిబిరం శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని ప్రాంతీయ కార్యాలయాల్లో జరుగనున్నాయి.

ఆర్థిక సహాయానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, సెప్టెంబరు 13: వితంతవులు, ఒంటరి మహిళలు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. రాష్ట్రప్రభుత్వ సాంఘిక సంక్షేమం, మహిళా హక్కుల శాఖ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 200 మంది మహిళలకు స్వీయవృత్తులు ప్రారంభించేందుకు తలా రూ.50,000 ఆర్థికసాయం అందజేయనున్నారు. 25 నుంచి 45 ఏళ్లలోపున్న మహిళలు www.tnwidowwelfareboard.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. లబ్ధిదారుల కుటుంబ వార్షికాదాయం రూ.1.20 లక్షల లోపుండాలి. ఒకరు ఒకసారి మాత్రమే రుణం తీసుకొని ఉండాలి.

చెన్నై హార్బర్-మధురవాయల్ ఎక్స్‌ప్రెస్ రోడ్డు నిర్మాణం

ఐసిఎఫ్,సెప్టెంబరు13:చెన్నై హార్బర్-మధురవాయల్ ఎక్స్‌ప్రెస్ పథకానికి కూవం నదిలో స్తంభాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ట్రాఫిక్ సమస్య నియంత్రించేలా చెన్నై హార్బర్ నుంచి కంటైనర్ లారీల కోసం ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.5,855 కోట్లతో హార్బర్-మధురవాయల్ మధ్య 26.56 కి.మీ దూరం ఎక్స్‌ప్రెస్‌రోడ్డు నిర్మించనున్నారు.ఈపథకంలో భాగంగా ప్రస్తుతం కూవం నదిలో 375 స్తంభాల నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి.

30 వరకు ఐటీఐ అడ్మిషన్ల గడువు పొడిగింపు

పెరంబూర్, సెప్టెంబరు 13: రాష్ట్రంలోని ఐటీఐల్లో అడ్మిషన్ల గడువు ఈ నెల 30వ తేది వరకు పొడిగించారు. ఉద్యోగావకాశాలు, శిక్షణా శాఖ ఆధ్వర్యంలో 102 ప్రభుత్వ, 311 ప్రైవేటు ఐటీఐలున్నాయి. 2024-25వ సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ కౌన్సెలింగ్ గత నెల 30వ తేదీతో ముగిసింది. ఖాళీ సీట్ల భర్తీకి అభ్యర్థులు సంబంధిత ఐటీఐలకు టెన్త్ మార్కుల జాబితా, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో వెళ్లి తమకు నచ్చిన కోర్సులో చేరవచ్చు. అడ్మిషన్ పొందిన వారికి నెలకు రూ.750 ప్రోత్సాహకం, ఉచిత సైకిల్, యూనిఫాం, విద్యా ఉపకరణాలు, బస్ పాస్ తదితరాలు అందజేస్తారు. వివరాలకు 9499055689 అనే నెంబరు సంప్రదించవచ్చు.

ఓనం ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 13: ఓనం పండుగ సందర్భంగా డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-కొచ్చువెల్లి-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06166 కొచ్చువెల్లి-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఫెస్టివల్ స్పెషల్ రైలు కొచ్చువెల్లిలో ఈ నెల 16వ తేది మధ్యాహ్నం 12.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06167 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-కొచ్చువెల్లి ఫెస్టివ్ స్పెషల్ చెన్నై సెంట్రల్ నుంచి ఈ నెల 17వ తేది మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.50 గంటలకు కొచ్చువెల్లి చేరుకుంటుంది.

రేపు 1,300 వినాయక విగ్రహాల నిమజ్జనం

ఐసిఎఫ్, సెప్టెంబరు 13: నగరంలో ఆదివారం 1,300 భారీ వినాయక విగ్రహాల నిమజ్జనం జరుగనుంది. నగరంలో 1,500 విగ్రహాలకు ఈ నెల 7వ తేది నంచి పూజలు నిర్వహిస్తున్నారు. వీటిలో కొన్ని విగ్రహాలను 11వ తేది నిమజ్జనం చేశారు. ఈ నేపథ్యంలో, శని, ఆదివారాల్లో మిగిలిన వాటిని నిమజ్జనం చేయనున్నారు. ఆదివారం 1,300 భారీ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి నిమజ్జనం చేయనుండడంతో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ విగ్రహాలు పట్టణంబాక్కం, నీలాంగరై, కాశిమేడు, తిరువొత్తియూర్ అనే నాలుగు ప్రాంతాల్లో నిమజ్జనం చేయనున్నారు.

కుండ్రక్కుడి ఆలయ ఏనుగు మృతి



ఆలయ ఏనుగు సుబ్బులక్ష్మికి నివాళులర్పిస్తున్న పొన్నంబళ అడిగళార్

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుండ్రక్కుడి షణ్ముగనాథ పెరుమాళ్ ఆలయ ఏనుగు సుబ్బులక్ష్మి అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గురువారం ఉదయం మరణించింది. కారైక్కుడి సమీపం కుండ్రక్కుడిలో ఉన్న షణ్ముగనాథ పెరుమాళ్ ఆలయానికి 1971లో ఓ భక్తుడు 'సుబ్బులక్ష్మి' అనే ఏనునుగును కానుకగా సమర్పించారు. ఈ ఏనుగును ఆలయానికి పక్కనే ఉన్న రేకుల గోదాములో సంరక్షిస్తున్నారు. ఇటీవల ఎండవేడి అధికంగా ఉండటంతో ఆ గోదాము రేకుల పైకప్పు కింద కొబ్బరి తడికెలు కట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో కొబ్బరి ఆకుల తడికెలకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. ఆ మంటల్లో చిక్కుకుని ఏనుగు సుబ్బులక్ష్మి తీవ్రంగా గాయపడింది. ఆలోగా అగ్నిమాపక దళం హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. గాయపడిన ఏనుగుకు వెటర్నరీ డాక్టర్లు చికిత్స అందించారు. శుక్రవారం వేకువజాము చికిత్స ఫలించక ఆ ఏనుగు కన్నుమూసింది. ఈ విషయం తెలుసుకున్న పొన్నంబళ అడిగళార్ ఏనుగు కళేబరంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏనుగు సుబ్బులక్ష్మి మృతితో స్థానిక భక్తులు శోకతప్తులయ్యారు.

పారిశ్రామిక ప్రతినిధుల సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 13: స్థానిక ప్రైవేటు హోటల్లో చిన్న, మధ్యతరహా సంస్థలకు నిధులు అందజేత తదితరాలపై జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రధాన జనరల్ మేనేజర్ సంజయ్‌గుప్తా, జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, వేలూరు జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ ఆనందన్, వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్ జిల్లాలకు చెందిన చిన్న, మధ్యతరహా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు అందజేస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, సెప్టెంబరు 13: కేవీ కుప్పం నియోజకవర్గ పరిధిలోని లత్తేరి, సెంజి, వడుగల్ తాంగల్, పిల్లాందిపట్టు, కేవీ కుప్పం, కొసవన్‌పుదూర్, వేపంగనేరి తదితర ప్రాంతాల్లో 645 మంది ఉన్నత పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు సైకిళ్ల అందజేసే కార్యక్రమం శుక్రవారం జరిగింది.కేవీ కుప్పం యూనియన్ కమిటీ అధ్యక్షుడు రవిచంద్రన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సైకిళ్ల అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీలు సీతారామన్, మురుగేశన్, పంచాయతి ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాచీన తమిళ సంస్థ ఉపాధ్యక్షురాలిగా సుధా శేషయ్యన్



సుధా శేషయ్యన్

ఐసిఎఫ్, సెప్టెంబరు 13: ప్రాచీన తమిళ సంస్థ ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ సుధా శేషయ్యన్‌ను నియమిస్తూ కేంద్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వరదరాజన్ ఉత్తర్వులు జారీచేశారు. తమిళనాడు డా.ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయ మాజీ ఉప కులపతి సుధా శేషయ్యన్ ప్రస్తుతం శాస్త్ర విశ్వవిద్యాలయ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆమెకు చెన్నైలో ఉన్న ప్రాచీన తమిళ పరిశోధన కేంద్ర సంస్థలో ఉపాధ్యక్షురాలిగా పదవి కల్పించారు. ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగనున్నారు.

తిరుచ్చిలో బయల్పడిన దేవతా విగ్రహం



ఐసిఎఫ్, సెప్టెంబరు 13: తిరుచ్చిలో మరుగుదొడ్డి కోసం గుంతలు తవ్వుతుండగా దేవతా విగ్రహం బయల్పడింది. ఈ జిల్లాలోని లాల్‌కుడి సమీపంలో పుదూర్‌పాళయం పంచాయతి పరిధిలోని తిరయాన్‌పాళయం గ్రామంలో పబ్లిక్ టాయిలెట్ నిర్మాణానికి గుంతలు తవ్వుతుండగా. ఓ రాత్రి విగ్రహాన్ని గుర్తించిన కార్మికులు వీఏఓ బాలకృష్ణన్‌కు సమాచారం అందించారు. 2.5 అడుగుల ఎత్తు దేవతా విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్న వీఏఓ పురావస్తు పరిశోధనలకు పంపించారు.

రెండు రోజులు పెరగనున్న ఉష్ణోగ్రతలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 13: రాష్ట్రంలో రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. పశ్చిమ దిశ గాలుల వేగంలో మార్పుల కారణంగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన స్వల్ప వర్షాల నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని తెలిపింది. అలాగే, రాబోయే రెండు రోజుల్లో సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని తెలిపింది. నగరం, శివారు ప్రాంతాల్లో శనివారం ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందని, పగటి ఉష్ణోగ్రలు 37 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశముందని తెలిపింది.

'పాండీ మెరీనా' ప్రాజెక్టుకు నిరసనగా జాలర్ల రాస్తారోకో



రాస్తారోకో జరుపుతున్న జాలర్లు

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వంబాకీరపాళయం వద్ద 'పాండీ మెరీనా' పేరుతో సముద్రతీరాన్ని పర్యాటక ప్రాంతంగామార్చే ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ జాలర్లు శుక్రవారం ఉదయం రాస్తారోకో జరిపారు. పాండీ మెరీనా స్థలంలో సందర్శకులు పడవలో షికారు చేసేలా బోట్ హౌస్ కూడా ఏర్పాటు చేయడంతో తమ జీవనోపాధికి నష్టం కలుగుతోందని జాలర్లు పేర్కొన్నారు. బోట్‌హౌస్ ఏర్పడక ముందు జాలర్లు పర్యాటకులను తమ పడవలో సముద్రంలోకి తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ప్రభుత్వమే బోట్‌హౌస్ పేరుతో పడవలను నడిపి తమ సంపాదనకు గండికొట్టిందని ఆరోపిస్తూ జాలర్లు ఈ ఆందోళనకు దిగారు.



టి.నగర్‌లోని రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం సాయంత్రం చాతుర్మాస వ్రతమాచరిస్తున్న ఉడిపి పెజావర్ మఠాధిపతి విశ్వప్రసన్న తీర్థస్వామిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న గవర్నర్ ఆర్ ఎన్ రవి



చెన్నై తేనాంపేట పీఎస్ శివసామి రోడ్డులో వాననీటి కాల్వ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్



చెన్నై టి.నగర్‌లోని సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యాలయంలో దివంగత పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, పార్టీ శ్రేణులు

24న అన్నాడీఎంకే ధర్నా

పెరంబూర్, సెప్టెంబరు 13: మహిళలు, చిన్నారులపై అధికమవుతున్న లైంగిక వేధింపులను అరికట్టడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వం తీరును నిరసిస్తూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేది ఆందోళన చేపట్టనుంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో... కొద్దిరోజులుగా హత్యలు, నేరాలు, దోపిడీలు వార్తలు ప్రధానంగా ఉండడం బాధాకరమన్నారు. మహిళలు, బాలికలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టడంలో డీఎంకే ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దీనికి నిరసనగా నగరంలో ఈ నెల 24వ తేది ఉదయం 9.30 గంటలకు పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళనకు మాజీ మంత్రి పి.వలర్మతి నేతృత్వం వహిస్తారని, ఈ ఆందోళనలో పార్టీ శ్రేణులు, అనుబంధ విభాగాల నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని పళనిస్వామి పిలుపునిచ్చారు.

పాఠశాలల్లో తనిఖీలకు ఉత్తర్వులు

ఐసిఎఫ్, సెప్టెంబరు 13: పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలని జిల్లా విద్యాధికారులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రెడ్‌హిల్స్ సమీపంలోని పమ్మదుకుళం ప్రాంతంలోని ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గింది. అయితే ఈ సంవత్సరం 566 మంది విద్యార్థులు చదువుతున్నట్లు ఆ పాఠశాల రికార్డుల్లో నమోదుచేశారు. అధికారుల తనిఖీలో ఆ పాఠశాలలో 219 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని తెలిసింది. దీంతో, పాఠశాల హెచ్‌ఎం లత, తాలూకా సహాయ విద్యాధికారి మేరీ జోసఫ్‌లను సస్పెండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా ఎక్కువగా చూపించే అవకాశముండడంతో, జిల్లా విద్యాధికారులు పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి వివరాలు సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

రాష్ట్రంలో నిషేధిత చైనా వెల్లుల్లి విక్రయాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 13: ప్రభుత్వం నిషేధించిన చైనా వెల్లుల్లి విక్రయాలు రాష్ట్రంలో నిరంతరాయంగా జరుగుతోంది. రాష్ట్రంలో కొడైకెనాల్, ఊటీ వంటి కొండ ప్రాంతాల్లో వెల్లుల్లి సాగుచేస్తున్నారు. ఆరు నెలలుగా ఈ ప్రాంతంలో వర్షాలు లేకపోవడంతో దిగుబడులు తగ్గాయి. దీంతో మార్కెట్లో వాటి ధర కిలో రూ.450 నుంచి రూ.600 వరకు పెరిగింది. ఈ నేపథ్యంలో, చైనా నుంచి గుజరాత్ మీదుగా రాష్ట్రానికి వెల్లుల్లి దిగుమతి చేసుకుంటున్నారు. 120 నుంచి 150 టన్నులు కంటైనర్లలో గుజరాత్‌కు, అక్కడి నుంచి రాష్ట్రానికి సరఫరా అవుతోంది. ఈ వెల్లుల్లిని కిలో రూ.200 నుంచి రూ.300 వరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఈ వెల్లుల్లి ఉత్పత్తికి క్రిమి సంహారక మందులు ఎక్కువగా వినియోగిస్తుండడంతో వాటిని ఆహారంగా తీసుకొనే వారికి అనారోగ్య సమస్యలు ఏర్పడుతుండడంతో 2014లోనే ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో 20 టన్నుల వెల్లుల్లి ప్రతిరోజు విక్రయమవుతోంది. దీనిపై చర్యలు చేపట్టాలని సంఘ శ్రేయోభిలాషులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న బావిని మూసివేయండి



నిరుపయోగంగా ఉన్న బావి

వేలూరు, సెప్టెంబరు 13: కీల్‌మొనవూరు పంచాయతి పెరుమాళ్ నగర్ శ్రీనివాస వీధిలో ఉన్న వినాయకుడి ఆలయం ముందు అప్పట్లో బావి తవ్వగా బండరాయి తగలడంతో నీరు రాలేదు. దీంతో, ఆ బావిని అలాగే వదిలివేశారు.దీంతో, ప్రస్తుతం ఆ బావిలో చుట్టుపక్కల వారు చెత్త వేస్తుండడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతూ దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. అటు ప్రజలు, ఇటు ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందిగా ఉన్న వినియోగంలో లేని బావిని మూసివేయాలని కోరుతూ సమాజసేవకుడు పాండ్యన్ శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కార్తికేయన్

వేలూరు, సెప్టెంబరు 13: స్థానిక సత్తువాచ్చేరి ఆర్టీఓ కార్యాలయం రోడ్డులో ఆమే ఎకాఫ్స్ సంస్థ 80వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం, మూలికల ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి పైగా పరీక్షలు చేయించుకోగా, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డా.భాస్కరన్ సహా పలువురు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 13: తిరుప్పూర్ జిల్లా ఉడుమలైపేట సమీపంలో కారు అదుపుతప్పి ఢీకొన్న ఘటనలో, బస్సు కోసం వేచి ఉన్న ముగ్గురు మృతి చెందారు. పాలప్పంపట్టి సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో సదాశివం (75), రంగస్వామి (62), మోహన్‌రాజ్ (40) మృత్యువాతపడ్డారు. పళని నుంచి కేరళ వైపు వెళ్తున్న కారు హఠాత్తుగా డ్రైవర్ అదుపుతప్పి రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళ్లి బస్టాండ్‌లో బస్సు కోసం నిల్చొని ఉన్న వారిపై దూసుకెళ్లింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



ప్యారీస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో భారత దేశం తరపున పాల్గొని హైజంప్‌లో కాంస్య పతకం సాధించి తిరిగొచ్చిన మారియప్పన్‌కు విమానాశ్రయం వద్ద స్వాగతం పలుకుతున్న క్రీడాభిమానులు, క్రీడా సంఘాల ప్రతినిధులు



గిండి రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్‌ఐఆర్‌ఎఫ్ టాప్ ర్యాంగింగ్ విద్యా సంస్థల నిర్వాహకులతో గవర్నర్ ఆర్‌ఎన్ రవి



చెన్నై మెరీనాబీచ్‌లోని మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి స్మారక స్థలం వద్ద అధికారులతో కలిసి పరిశీలిస్తున్నన్న రాష్ట్ర సమాచార శాఖ మంత్రి సామినాథన్

తాళికి పథకంలో ఎంత మంది లబ్ధిపొందారు

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

ప్యారీస్, సెప్టెంబరు 13: తాళికి బంగారం పథకం కింద 2017 నుంచి 2021 వరకు ఎంతమంది లబ్ధిపొందారో నివేదిక దాఖలుచేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అన్నానగర్‌కు చెందిన చిత్ర దాఖలుచేసిన పిటిషన్‌లో... ఇంటి పనులు చేసుకుంటూ నెలకు రూ.6,000 ఆదాయంతో తమ కుమార్తెను కళాశాలలో చదివించానని, ఆమెకు వివాహం చేయాలని నిర్ణయించి 2021వ సంవత్సరం మూవలూరు రామామృతం అమ్మయార్ స్మారక వివాహ పథకం కింద తాళికి బంగారం కోరుతూ దరఖాస్తు సమర్పించినట్లు తెలిపారు. దీనిని పరిశీలించిన అయనావరం తహసీల్దార్ ఆ దరఖాస్తును నిరాకరించినట్లు తెలిసింది. అయనావరం తహసీల్దార్‌కు వ్యతిరేకంగా హైకోర్టులో చిత్ర దాఖలుచేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి దండపాణి 2017 నుంచి 2021వ సంవత్సరం వరకు తాళికి బంగారం పథకం కింద ఎంతమంది లబ్ధిపొందారు, ఎన్ని దరఖాస్తులు నిరాకరించారు, వీటికి గత కారణాలతో నివేదిక సమర్పించాలని రాష్ట్రప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ ఈ నెల 18వ తేదీకి వాయిదావేశారు.

మహావిష్ణు బ్యాంక్ అకౌంట్ పరిశీలన

ప్యారీస్, సెప్టెంబరు 13: ఆధ్యాత్మిక ప్రవచనకర్త మహావిష్ణు బ్యాంక్ ఖాతాలను పరిశీలిస్తున్నట్లు నగర పోలీసులు తెలిపారు. ఇటీవల సైదాపేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న మహావిష్ణు, దివ్యాంగులను కించపరిచేలా వ్యాఖ్యానించడంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. కోర్టు అనుమతితో ఆయనకు కస్టడీలోకి తీసుకొని విచారణ జరుపుతున్న పోలీసులు, మహావిష్ణుకు చెందిన బ్యాంక్ ఖాతాలను పరిశీలిస్తున్నారు. ఆ ఖాతాలకు విదేశాల నుంచి నిధులు జమ అయ్యాయా, నిధుల లావాదేవీలు తదితర వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్నా విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు

పెరంబూర్, సెప్టెంబరు 13: స్థానిక గిండిలోని అన్నా విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు వచ్చింది. క్రోంపేటలో ఉన్న ఎంఐటీ కళాశాలకు గురువారం బాంబు బెదిరింపు రాగా,, శుక్రవారం అన్నా విశ్వవిద్యాలయానికి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. విశ్వవిద్యాలయం అందజేసిన ఫిర్యాదుతో పోలీసులు, బాంబ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకొని తనిఖీలు జరిపి బాంబు బెదిరింపు ఫేక్ అని తేల్చారు. కాగా, ఈ-మెయిల్ పంపిన వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. అన్నా విశ్వవిద్యాలయానికి రెండు నెలల్లో 10వ సారి బాంబు బెదిరింపు మెసేజ్ రావడం గమనార్హం.

వీఆర్‌కు వేలూరు డీఐజీ

వేలూరు, సెప్టెంబరు 13: యావజ్జీవ ఖైదీని ఇంటి పనుల కోసం వినియోగించిన వ్యవహారంలో ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంలో వేలూరు జైళ్ల శాఖ డీఐజీ రాజ్యలక్ష్మి వెయిటింగ్ లిస్ట్‌కు పంపించగా, వేలూరు పురుషుల జైలు అదనపు సూపరింటెండెంట్ అబ్దుల్ రెహ్మాన్‌ను చెన్నై పుళల్ జైలుకు బదిలీ చేస్తూ జైళ్ల శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

కర్ణాటక నుంచి నకిలీ మద్యం... ముఠా అరెస్ట్

ప్యారీస్, సెప్టెంబరు 13: కర్ణాటక నుంచి రాష్ట్రానికి అక్రమంగా మద్యం తరలించిన మాజీ సైనికుడి సహా 14 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి 2,400 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కళ్లకుర్చి కల్తీ సారా ఘటన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం విక్రయాలను అదుపుచేసేందుకు తమిళనాడు ఎక్సైజ్ అధికారులు గట్టి చర్యలు చేపట్టారు. పొరుగు రాష్ట్రాల నుంచి నకిలీ మద్యం తరలిస్తున్న ముఠాలను అరెస్ట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 3వ తేది తిరుచ్చి విమానాశ్రయం సమీపంలో మురుగవేల్ ను అరెస్ట్ చేసిన పోలీసులు, బెంగళూరు నుంచి నకిలీ మద్యం సీసాలను తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. దీంతో మురుగవేల్ అనుచరులు వీర్రాజు (57)ను ఈ నెల 5న అరెస్ట్ చేశారు. అతను మిలటరీలో పనిచేస్తూ ఇటీవల పదవీవిరమణ పొందినట్లు తెలిసింది. వీరిద్దరి వద్ద జరిపిన విచారణలో వెల్లడైన సమాచారం ఆధారంగా మరో 12 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

నగరంలో నకిలీ విలేకరి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 13: స్థానిక మైలాపూర్‌లో నివసిస్తూ, గూడువాంజేరి సబ్ రిజిస్ట్రార్‌ను బెదిరించిన కేసులో నకిలీ విలేఖరి వారాహిని నగర పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న అనేక మంది బాధితులు ఫిర్యాదులు చేసేందుకు క్యూ కట్టారు. దీంతో తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై పోలీసులు ఆలోచన చేస్తున్నారు. మైలాపూర్ మంగాపురంకు చెందిన వైద్యలింగం అనే వ్యక్తి గూడువాంజేరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. ఈయన నివాసానికి వెళ్ళిన వారాహి రూ.50 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించాడు. దీనిపై వైద్యలింగం మైలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, వారాహిని అరెస్టు చేశారు. విచారణలో వారాహి ఒక నకిలీ విలేఖరిగా తేలింది. ఇదిలావుండగా, వారాహి బాధితులు ఇపుడు వరుసగా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు.

ప్లస్‌టూ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అడయార్, సెప్టెంబరు 13: సేలం జిల్లాలో గర్భం దాల్చిన ప్లస్‌టూ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆమెను ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. సేలం జిల్లా ఓమలూరు ప్రాంతానికి చెందిన 16 యేళ్ళ బాలిక స్థానికంగా ఉండే ఒక కాలేజీలో ప్లస్‌టూ చదువుతోంది. అయితే, గత వారం రోజులుగా పాఠశాలకు వెళ్ళకుండా ఇంట్లోనే ఉంటోంది. తల్లిదండ్రులు నిలదీస్తే తనకు కడుపునొప్పి అని చెప్పింది. ఈ నేపథ్యంలో స్వీయ గర్భనిర్ధారణ పరీక్ష చేసుకున్న ఆ బాలిక గర్భందాల్చిన విషయాన్ని తెలుసుకుంది. ఈ విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని భావించి ఇంటిలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన తల్లిదండ్రులు ఆ బాలికను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గర్భానికి కారణం ఎవరో తెలుసుకోలేకపోతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఆకట్టుకుంటున్న 'రాజస్థాన్ క్రాఫ్ట్ మేళా'



ప్రదర్శనలో ఉన్న కాటన్ దుస్తులు

పెరంబూర్, సెప్టెంబరు 13: పలురకాల హస్తకళా ఉత్పత్తులతో నిర్వహిస్తున్న 'రాజస్థాన్ క్రాఫ్ట్ మేళా' అందర్నీ ఆకట్టుకుంటోంది.. మహిళల కుర్తా, రేప్రాన్ స్కర్ట్, కాటన్ నైటీలు, జైపూర్ స్టోన్ జ్యువెలరీ, చెన్నపట్నం టాయ్స్, నవరాత్రి కొలువు బొమ్మలు సహా దేశంలోని హస్త కళాకారుల ఉత్పత్తులన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే విధంగా వెస్ట్ మాంబళం లేక్ వ్యూ రోడ్డులోని రాజేశ్వరి హాలులో ఈ ప్రదర్శన ఏర్పాటైంది. ఈ నెల 22 వరకు ఉదయం 10 నుంచి రాత్రి 9.30 గంటలకు ఈ ప్రద్శనను వీక్షించవచ్చు. ఈ ప్రదర్శన సందర్భంగా కొనుగోళ్లపై 20 శాతం రాయితీ అందజేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ ఎంపీతో పార్కింగ్ సిబ్బంది గొడవ

- క్షమాపణ చెప్పిన అధికారులు

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మైలాడుదురై కాంగ్రెస్ ఎంపీ ఆర్ సుధా దగ్గర పార్కింగ్ ఫీజు కోసం ఒత్తిడి చేసి, ఆమె పట్ల పార్కింగ్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. రెండు రోజుల క్రితం ఎంపీ ఆర్.సుధ ఢిల్లీ నుంచి విమానంలో వేకువజాము 1.30 గంటలకు చేరుకున్నారు. విమానాశ్రయంలో తన కారులో బయలుదేరుతుండగా పార్కింగ్ సిబ్బంది అడ్డుకుని పార్కింగ్ ఫీజు చెల్లించాలన్నారు. తాను ఎంపీగా ఉండటంతో తాను పార్కింగ్ ఫీజు చెల్లించనవసరం లేదని చెప్పినా ఆ సిబ్బంది పట్టించుకోలేదు. చివరకు ఆమె దగ్గర బలవంతంగా పార్కింగ్ ఫీజు వసూలు చేశారు. ఈ విషయమై ఎంపీ సుధ విమానయాన సంస్థ ఉన్నతాధికారులకు, మీనంబాక్కం విమానాశ్రయ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా, ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దానిపై స్పందించిన అధికారులు ప్రైవేటు సంస్థ పార్కింగ్ సిబ్బంది అనుచిత ప్రవర్తన పట్ల బేషరతుగా క్షమాపణ చెబుతున్నట్లు ప్రత్యుత్తరమిచ్చారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూస్తామన్నారు.

పొదుపుగా ఖర్చు చేసే దర్శకుల్లో శీనురామస్వామి ఒకరు

● విజయ్ సేతుపతి

నిర్మాత తనను నమ్మి పెట్టుబడి పెట్టినప్పటికీ... దాన్ని పొదుపుగా ఖర్చు చేసే దర్శకుల్లో శీను రామస్వామి ఒకరని ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి అన్నారు. విజన్ హౌస్ పతాకంపై డాక్టర్ పి.అరుళానందం, మ్యాథ్యూ అరుళానందం సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'కోళిపన్నై చెల్లదురై'. శీను రామస్వామి దర్శకత్వంలో బ్రిగిడ హీరోయిన్‌గా ఏగన్, యోగిబాబు ప్రధాన పాత్రల్లో నటించారు. ఇతర పాత్రల్లో సత్యదేవి, భవ చెల్లదురై, లియో శివకుమార్, కుట్టిపులి దినేష్, మానస్వి, రియాజ్ తదితరులు నటించారు. ఈ నెల 20వ తేదీన శక్తి ఫిలిమ్ ఫ్యాక్టరీ విడుదల చేయనుంది. ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి ముఖ్య అతిథిగా పాల్గొని ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'శీను రామస్వామి దర్శకత్వంలో నాలుగు చిత్రాల్లో నటించాను. ఆయన కథ చెప్పేటపుడు గాని సన్నివేశాన్ని చిత్రీకరించే సమయంలో ఎపుడు కూడా తడబడటం చూడలేదు. తనను నమ్మి పెట్టుబడి పెట్టే నిర్మాతను ఏదో రూపంలో ఆదుకునేలా పొదుపుగా ఖర్చు చేసి చిత్రాన్ని పూర్తి చేసే దర్శకుడు. అలాంటి దర్శకుడి ద్వారా హీరోగా ఏగన్ పరిచయం కావడం అతడి అదృష్టం. నటుడు యోగిబాబు మాట్లాడుతూ, 'నా పుట్టిన రోజున ఈ చిత్రానికి శ్రీకారం చుట్టాం. అనుకున్నట్టుగానే నిర్మాణం పూర్తి చేశాం. నిర్మాతకు ధన్యవాదాలు. జాతీయ అవార్డు గ్రహీత శీను రామస్వామితో పనిచేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఇందులో ఒక మంచి పాత్ర ఇచ్చారు. సాధారణంగా ప్రతి చిత్రంలో నేను కౌంటర్ ఇస్తుంటాను. కానీ, ఇందులో అలాంటి అవకాశం లేకుండా పోయింది. దర్శకుడు శీను రామస్వామి మాట్లాడుతూ, 'నిర్మాతల్లో ఒకరైన మ్యాథ్యూ చిన్న వయసులోనే ఎంతో బాధ్యత, కర్తవ్యం, అంకితభావంతో పనిచేసే యువకుడు. తండ్రిని ఆదర్శంగా తీసుకుని పయనిస్తున్నాడు. ఈ సినిమా కోసం పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ కృతజ్ఞతలు. ఈ చిత్రంలో ఒక మంచి సబ్జెక్టును చెప్పాను. జీవితం నన్ను వదిలివేసింది. ఈ జీవితాన్ని గడపటం ఏమాత్రం ఇష్టం లేదు. ఈ జీవితంలో నాకంటూ ఎవరూ లేరు అని భావించే వారికి ఒక మంచి సందేశ సినిమాగా ఉంటుంది. ఈ విశ్వం ఏ వ్యక్తినీ వదిలిపెట్టదు. ఏదో ఒక రూపంలో వచ్చి అక్కున చేరుకుంటుంది' అని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు ఎన్ఆర్ రఘునందన్, హీరో ఏగన్, హీరోయిన్ బ్రిగిడ తదితరులు ప్రసంగించారు.


'కోళిపన్నై చెల్లదురై' ఆడియో రిలీజ్ వేడుక

'నందన్' చిత్రం నిర్మించాలంటే ధైర్యం కావాలి

● సీమాన్


శశికుమార్ - సీమాన్

'నందన్' వంటి చిత్రాన్ని నిర్మించాలంటే ఎంతో ధైర్యం కావాలని ప్రముఖ దర్శకుడు, నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ అన్నారు. ఎరా శరవణన్ దర్శకత్వం వహించిన నందన్ చిత్రం ఆడియోను శుక్రవారం నగరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీమాన్ ప్రసంగిస్తూ, 'నా బిజీ షెడ్యూల్‌తో సంబంధం లేకుండా ఈ సినిమా కథ నన్ను ఈ ఆడియో వేడుకకు వచ్చేలా ప్రేరేపించింది. ఈ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతో అంకితభావంతో పనిచేశారు. ఇది చాలా ముఖ్యమైన చిత్రం. ఇలాంటి చిత్రాన్ని రూపొందించడానికి ఎంతో ధైర్యం కావాలి. ప్రతి ఒక్కరూ తప్పకుండా చూడాలని కోరారు. హీరో శశికుమార్ మాట్లాడుతూ, 'తొలుత ఈ చిత్రాన్ని నేనే స్వయంగా నిర్మించాలని భావించాను. ఆ తర్వాత అతిథి పాత్రలో నటించాలని అనుకున్నాను. చివరకు ఈ చిత్రంలో పూర్తిస్థాయిలో నటించాలని నిర్ణయించుకుని హీరోగా చేశాను. ఈ స్క్రిప్టు నిజంగా గొప్ప కథ. సినిమా చిత్రీకరణ సమయంలో ఎన్నో ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొన్నాం. ఈ సినిమా కథ చాలా బాగుంది. ఔట్‌పుట్ కూడా ఆసక్తికరంగా వచ్చింది. ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అన్నారు. శృతి పెరియస్వామి, మాధేష్, మిథున్, బాలాజీ శక్తివేల్, కొట్ట ఎరుంబు స్టాలిన్, సముద్రఖని, వి.జ్ఞానవేల్, జీఎం కుమార్ తదితరులు నటించగా, ట్రైడెంట్ ఆర్ట్స్ పతాకం, ఎరా ఎంటర్‌టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. త్వరలోనే విడుదలకానుంది.



చిత్రజ్యోతి

తండ్రికొడుకుల ఎమోషనల్ జర్నీ 'రామం రాఘవం'

'రామం రాఘవం'లో సముద్రఖని, ధన్‌రాజ్

ప్రముఖ దర్శకనటుడు సముద్రఖని ప్రధాన పాత్రలో తమిళం, తెలుగు భాషల్లో తెరకెక్కిన చిత్రం 'రామం రాఘవం'. ప్రముఖ తెలుగు కమెడియన్ ధన్‌రాజ్ తొలిసారి దర్శకత్వం వహించారు. పృథ్వీ పోలవరపు నిర్మాత. తండ్రికొడుకుల ఎమోషనల్ జర్నీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ నెల 5వ తేదీ గురుపూజోత్సవం సందర్భంగా తండ్రికుమారుల మధ్య అనుబంధం, భావోద్వేగానికి సంబంధాన్ని వివరిస్తూ సాగే పాట విడుదల చేశారు. ఈ మెలోడీ సాంగ్ విడుదలైన కొన్ని గంటల్లోనే వైరల్ కావడం గమనార్హం. స్లేట్ పెన్సిల్ స్టోరీస్ పతాకంపై నిర్మాత ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వీ పోలవరపు నిర్మాణంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఈ ద్విభాషా చిత్రంలో తండ్రి తనయుల మధ్య ఎఫెక్షన్‌ను ప్రధానంగా ప్రస్తావించారు. కాగా, ఈ చిత్రంలో మోక్ష, హరీష్ ఉత్తమన్, సత్య, పృథ్వీ, శ్రీనివాసరెడ్డి, చిత్రం శ్రీను, ప్రమోదిని, రాకెట్ రాఘవ, రచ్చరవి, ఇంటూరి వాసు తదితరులు నటించారు. అరుణ్ చిలువేరు సంగీతం. తమిళం, తెలుగు భాషల్లో త్వరలోనే ప్రేక్షకుల ముందుకురానుంది.


అజిత్ కొత్త లగ్జరీ కారు

మరో లగ్జరీ కారు కొన్న అజిత్

కోలీవుడ్ అగ్రహీరో అజిత్ మరో లగ్జరీ కారు కొనుగోలు చేశారు. పోర్స్ జీటీ3 ఆర్ఎస్ మోడల్ ఫెరారీ రేస్ కారును ఆయన కొనుగోలు చేశారు. ఈ లగ్జరీ కారు ధర రూ.4 కోట్ల నుంచి రూ.9 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ కారు క్షణాల్లో వంద కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఈ విషయాన్ని ఆయన సతీమణి షాలిని తన ఇన్‌స్టా ఖాతాలో వెల్లడిస్తూ, కారు ఫొటోలను కూడా షేర్ చేశారు. ఈ ఫొటోలను అజిత్ అభిమానులు షేర్ చేస్తూ లైకుల వర్షం కురిపిస్తున్నారు. మరోవైపు, ప్రస్తుతం అజిత్ రెండు చిత్రాల్లో నటిస్తున్నారు. మగిళ్ తిరుమేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విడాముయర్చి' దీపావళికి విడుదలకానుండగా, ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కే 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది.

కళలు.. సమాజసేవ... అన్ని రంగాల్లో విజయం

తరుణి


'తెలుగు తరుణి' సభ్యులతో సంగీత కచేరి చేస్తూ....


ఆల్బం విడుదల కార్యక్రమంలో....

● సమర్ధవంతమైన వ్యాపారవేత్తగా రాణిస్తున్న పొన్నూరి మణిమాలారావు

కాలం ఎంతో అమూల్యమయింది. అందుకే సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తమకున్న నైపుణ్యతతో నేటి మహిళలు కాలాన్ని తమకనుకూలమైన రీతిలో ఉపయోగించుకుంటూ అద్భుతాలను సృష్టిస్తున్నారు. విభిన్న పంథాల్లో అడుగులు వేస్తూ ఎందరికో పథనిర్దేశం చేస్తున్నారు. కాలం విలువను గుర్తించి ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేయాలనే ఆశయంతో వ్యాపారాన్ని సమర్థతతో నిర్వహిస్తూ, తన కళానైపుణ్యతకు పదును పెట్టుకుంటూ, విజయాలు సాధిస్తున్న మణిమాల జీవన ప్రస్థానం నేటి 'తరుణి'లో......

- వేళచ్చేరి



మణిమాల వైజాగ్‌లో జన్మించారు. తండ్రి వెంకట్రావు, తల్లి సావిత్రీదేవి. మణిమాల వైజాగ్‌లోనే పాఠశాల విద్యాభ్యాసం, బీవీకే కళాశాల నుంచి బి.కామ్ పూర్తిచేశారు. హిందీలో విశారద వరకు చదివారు.

కుటుంబం: వివాహానంతరం మణిమాల చెన్నై వచ్చారు. భర్త పీవీ కృష్ణారావు వ్యాపారం చేస్తారు. ఈ దంపతులకు కుమార్తె, కుమారుడు. ఇద్దరూ ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడ్డారు.


మణిమాల రూపొందించిన వెంకటేశ్వరస్వామి రివర్స్ గ్లాస్ పెయింటింగ్

అభిరుచులు... ఆసక్తులు..

మణిమాలకు పలు విషయాలపై ఆసక్తి ఎక్కువ. చిన్నతనంలోనే భరతనాట్యంలో శిక్షణ తీసుకొని ఎన్నో ప్రదర్శనలిచ్చారు. హస్తకళలపై మక్కువతో తంజావూర్ పెయింటింగ్స్‌లో నైపుణ్యం సాధించారు. రివర్స్ గ్లాస్ పెయింటింగ్స్, పాత పెయింటింగ్ ఇలా ఎన్నోరకాల పెయింటింగ్స్ నేర్చుకున్నారు. ఖాళీగా ఉండేందుకు ఇష్టపడని ఆమె యీ మధ్యనే మండల ఆర్ట్ నేర్చుకున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆన్‌లైన్‌లో పాటలు, భజనలు నేర్చుకుంటూ మిత్రమండలితో కలసి 50 వరకు భజన కార్యక్రమాలోట్ల పాల్గొన్నారు. చెన్నైలోనే కాక భద్రాచలం, శ్రీకాళహస్తి, షిర్డీ తదితర చోట్ల తమ భజన కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ శ్రీనిబాబు అనే సంగీత దర్శకుడి సారథ్యంలో విడుదల చేసిన మ్యూజిక్ ఆల్బమ్‌లో మణిమాల పాటలు పాడారు. 'తెలుగు తరుణి' మ్యూజిక్ గ్రూప్‌తో కలసి ఎన్నో దేవాలయాల్లో భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు మణిమాల. అన్నానగర్ మ్యూజిక్ క్లబ్ సభ్యురాలైన మణిమాల 'జూమ్'లో జరిగే వారి పాటల కార్యక్రమంలో కూడా పాలుపంచుకుంటారు. సంగీతంపై అమితాసక్తితో ప్రస్తుతం వీణ నేర్చుకుంటున్నారు. అంతేకాదు, ఆమెకి కీ బోర్డ్‌లో కూడా ప్రవేశం ఉంది.

ఏ మాత్రం విరామం దొరికినా కొత్త విషయాలు నేర్చుకోవాలన్న జిజ్ఞాస ఆమెలో ఎక్కువ. అది వయసుతో పాటు పెరుగుతూ మరెన్నో కళల్లో ప్రవేశించడానికి దోహద పడింది. ప్రాణిక్ హీలింగ్ కూడా నేర్చుకున్న ఆమె, యోగా పట్ల ఆసక్తితో సిద్ధి సమాధి యోగా నేర్చుకున్నారు. ప్రతి రోజు దానిని తన దైనందిన జీవితంలో భాగం చేసున్నారు. కొత్త విషయాల పట్ల కుతూహలం సోప్ తయారీ పట్ల ఆసక్తి కలిగించేలా చేసింది.

వ్యాపారంలో ప్రవేశం....

గృహిణిగా కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తూ, ఇష్టమైన కళలు నేర్చుకుంటూ సమయం గడుపుతున్న మణిమాలను వ్యాపారంలో ప్రవేశింపజేసిన ఘనత ఆమె భర్తది. భర్త ప్రోత్సాహంతో ఆమె వ్యాపారంలోకి అడుగుపెట్టారు. భర్త బిజినెస్‌లో తనూ పార్టనర్‌గా చేరి వ్యాపారబాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్యారీస్ కార్నర్‌లో 'పర్‌ఫెక్ట్ బేరింగ్ కంపెనీ' పనులను భర్తతో పాటు సమరవంతంగా నడిపిస్తున్నారు. ఇంట్లో పెద్దల ప్రోత్సాహంతో బాటు పిల్లల సహకారం కూడా ఉండడంతో మణిమాల ఎంతో ఉత్సాహంగా వ్యాపారాభివృద్ధికి కృషిచేస్తున్నారు.

తీగలు సాగిన ఆధ్యాత్మిక అభిరుచి....

దేవుని పట్ల విశ్వాసం, దైవచింతన అమితంగా కలిగిన మణిమాల భర్తతో కలసి ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. చెన్నైకి 40 కి.మీ దూరంలోని పెరియపాలెం వద్ద ఈ దంపతులు సరస్వతీ దేవాలయాన్ని నిర్మించి నిత్యపూజలు తదితర కార్యక్రమాలు జరుపుతున్నారు. మణిమాల తన సమయంలో కొంతభాగం లలితా, విష్ణు సహస్రనామ పారాయణ, సత్సంగాల్లో గడుపుతుంటారు.

"స్త్రీలు కూడా పురుషులతో సమంగా అన్ని రంగాల్లోముందుకు రావాలి. సంస్కృతీ సాంప్రదాయాలను గౌరవించాలి. ఉమ్మడి కుటుంబ సంస్కృతిని ప్రోత్సహించాలి. పిల్లల్లో బాల్యం నుండే నైతిక విలువలను పెంపొందింపజేయాలి. కాలం విలువను అందరూ గుర్తించి సమయాన్ని సద్వినియోగం జేసుకోవాలి." అని నైతిక విలువలకు, మానవీయ విలువలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చే మణిమాల తరుణితో తన మనోభావాలను పంచుకున్నారు.


అన్నదానం చేస్తూ...

సమాజసేవ... : తన పరిధిలో సమాజానికి వీలైనంత సేవ చేయాలనేది మణిమాల ఆకాంక్ష. ఆర్యవైశ్య మహిళా సభకు ఛైర్‌పర్సన్‌గా కొంతకాలం పనిచేసి తద్వారా ఎన్నో సమాజహిత కార్యక్రమాలను నిర్వహించారు. కొవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఎంతోమందికి ఆహారం, మందులు అందించారు. సమాజానికి తన వంతు సేవలందించాలన్నది ఆమె అభిమతం.

జీహెచ్‌లో క్యాన్సర్ చికిత్సకు కొత్త పరికరం

● ప్రారంభించిన మంత్రి సుబ్రమణ్యం


క్యాన్సర్ చికిత్సా పరికరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రి

చెన్నై, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్‌గాంధీ స్మారక సర్వజన ప్రభుత్వ ఆస్పత్రి (జీహెచ్)లో క్యాన్సర్ చికిత్స కోసం ఏర్పాటు చేసిన టెలీ కోబాల్ట్ పరికరాన్ని ఆరోగ్య శాఖమంత్రి ఎం.సుబ్రమణ్యం శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ పరికరం ద్వారా క్యాన్సర్ రోగులను ఔట్ పేషంట్లుగానే చికిత్స అందించటానికి వీలవుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి క్యాన్సర్‌కు చికిత్సలందించటంలో అగ్రస్థానంలో ఉందన్నారు. ఆస్పత్రి క్యాన్సర్ చికిత్సా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ విజయశ్రీ, ప్రిన్సిపాల్ డాక్టర్ థెరణిరాజన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


చెన్నైలో కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ప్రపంచమహిళా వ్యవహారాల విభాగం అమెరికా రాయబారి గీతారావు గుప్తా తదితరులు


చేపాక్ కలైవానర్ అరంగంలో జరిగిన సభలో నగరంలో ఫార్ములా 4 కార్ల రేసు సందర్భంగా విశిష్ట సేవలందించిన కార్పొరేషన్ అధికారులు, పారిశుధ్య కార్మికులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మంత్రులు ఉదయనిధి, పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం, ఎంపీ దయానిధి మారన్

వైద్య పరికరాలను అందజేసిన రోటరీ క్లబ్



ఆక్సీమీటర్ అందజేస్తున్న నిర్వాహకులు

అడయార్, సెప్టెంబరు 13: రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ నగరంలోని మూడు ప్రధాన ఆస్పత్రులకు వైద్య పరికరాలను అందజేశారు. శ్వాససంబంధిత వ్యాధులకు ఎంతగానో ఉపయోగపడే రెస్పిరేటరీ ఆక్సీమీటర్లతో పాటు ఇతర మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌తోపాటు డివైస్‌లను అందజేశారు. ఈ పరికరాల ధర రూ.13.5 లక్షల వరకు ఉంటుందని టి.నగర్ రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ నిర్వాహకులు శుక్రవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.


పూల రంగవల్లికలతో సందడి చేస్తున్న విద్యార్థినులు

కేరళ ఆచారాలు... పూల రంగవల్లులు

● నగరంలో 'ఓనం' సందడి

ప్యారీస్, సెప్టెంబరు 13: దక్షిణ భారత దేశంలో కేరళ రాష్ట్రంలో జరుపుకొనే అతిపెద్ద పండుగ ఓనం. ఈ పండుగను వచ్చే ఆదివారం వామన జయంతిగా జరుపుకోనున్నారు. శ్రావణ నక్షత్రాన్ని మలయాళంలో 'తిరు ఓనం' అంటారు. ఆ రాష్ట్రంలో ఈ పండుగను పది రోజులపాటు కోలాహలంగా జరుపుకోనున్న నేపథ్యంలో, రాజధాని నగరం చెన్నైలో ముందుగానే పండుగ వాతావరణం కనిపించింది. కేరళ ఆచారాలు, సంప్రదాయాలతో ముడిపడిన ఓనంను ఆహ్వానిస్తూ శుక్రవారం అడయార్‌లోని ఎంజీఆర్ జానకి కళాశాల, అన్నా నగర్ వల్లియమ్మ మహిళా కళాశాల ప్రాంగణాలు సాంస్కృతిక కార్యక్రమాలతో కళకళలాడాయి. రకరకాల పూలతో వేదిక ప్రాంగణాలను అందంగా తీర్చిదిద్ది కేరళ సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినులు అలరించారు. కైకొట్టి కలి నృత్యంతో ఆకట్టుకున్నారు. అదేవిధంగా జానపద కళాకారులు మహాబలి చక్రవర్తి, పులుల వేషధారణలతో సందడి చేశారు. ఇదిలా ఉండగా, ఓనం పండుగ సందర్భంగా కోడంబాక్కం, రాజాఅన్నామలైపురం సహా నగరంలో అయ్యప్ప స్వామి కొలువుదీరిన ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.


టగ్ ఆఫ్ వార్ క్రీడలో విద్యార్థినులు


ఓనం సంప్రదాయ వస్త్రధారణ


పులి వేషంలో కళాకారుల సందడి


కేరళ సంప్రదాయ నృత్యం